చినజీయర్‌స్వామిని కలిసిన డీసీపీ



చినజీయర్‌స్వామి నుంచి తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న డీసీపీ రాజేశ్

శంషాబాద్ రూరల్: శంషాబాద్ జోన్ డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన రాజేశ్ బుధవారం ముచ్చింతల్‌లోని ఆశ్రమంలో చినజీయర్‌స్వామిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీకి చినజీయర్‌స్వామి తీర్థప్రసాదాలు అందజేశారు.

నీట్ రద్దు ధర్నాకు తరలిన యూత్ కాంగ్రెస్ నేతలు



ఢిల్లీకి బయలుదేరుతున్న నేతలు

శంషాబాద్: నీట్ పరీక్ష రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఢిల్లీలో గురువారం ధర్నా చేపట్టనున్నారు. ఈ ధర్నాకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనా రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నేతలు శంషాబాద్ విమానాశ్రయం నుంచి బుధవారం ఢిల్లీకి బయలుదేరారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు విఘ్నేష్‌కుమార్, శంషాబాద్ అధ్యక్షుడు చందుయాదవ్, నాయకులు పూర్ణచందర్, ఇమ్రాన్ ఖాన్ తదితరులు బయలుదేరారు.

మూసీ నదిని పరిరక్షించండి



మూసీనదిని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మణికొండ: గండిపేట చెరువు నుంచి నార్సింగి మీదుగా ఉన్న మూసీ నదిలో మట్టిని నింపి నిర్మాణాలు చేపడుతూ దాని ఉనికికి ప్రమాదం కల్పిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి డి.కిరణ్ అన్నారు. బుధవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి మూసీ నది ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో నది ప్రాంతాన్ని ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాలతో రాబోయే రోజుల్లో స్థానిక గ్రామాలు ముంపునకు గురయ్యే పరిస్థితి వస్తుందన్నారు. ఇదే విషయాన్ని మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో నార్సింగి మాజీ వార్డు సభ్యులు వినోద్ కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఐటీలో ముగిసిన సదస్సు



సివిల్ హెచ్ఓడీని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో బుధవారం సస్టెనబుల్ టెక్నాలజీస్ ఇన్ సివిల్ ఇంజినీరింగ్ అనే అంశంపై నిర్వహించిన సదస్సు ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. సాంకేతికత వినియోగం, వినూత్నమైన ఆలోచనలు, ఉపాధి కల్పనల పరిష్కారాల గురించి అన్వేషించాలన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కేవీ రమణారెడ్డి పదవీ విరమణ సందర్భంగా సదస్సులో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుధాకర్‌రెడ్డి, కో ఆర్డినేటర్‌లు డాక్టర్ వి. వెంకటరామయ్య, ఎస్. జయప్రకాశ్‌నారాయణ, జి. శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం



కోకాపేటలో పర్యటిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్, కౌన్సిలర్‌లు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్, కమిషనర్ టి. ప్రవీణ్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట 5వ వార్డు పరిధిలో పర్యటించారు. వార్డులో కొనసాగుతున్న శ్మశానవాటిక, రోడ్లు, కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పారిశుధ్య పనుల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు జి.శివారెడ్డి, ఎ.దుర్గేశ్‌యాదవ్, శానిటేషన్ ఇన్‌చార్జి లచ్చిరాం, సూపర్‌వైజర్ మహిపాల్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చినుకు కోసం ఎదురు చూపులు

- వరి తూకాలకు మించిపోతున్న సమయం
- ఖరీఫ్ సాగుపై రైతుల్లో ఆందోళన

శంషాబాద్ రూరల్: చినుకు కోసం రైతు ఎదురు చూస్తున్నాడు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా సరైన వానలు లేక రైతులు దిగాలు చెందుతున్నారు. వర్షాధార పంటలతో పాటు బోర్ల కింద సాగు చేసే వరి, కూరగాయల సాగు ముందుకు సాగడం లేదు. ఓ వైపు ఎండలు తగ్గకపోవడం.. మరో వైపు భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లలో నీటి మట్టాలు తగ్గిపోతున్నాయి.

వరిసాగుపై ఆందోళన

వరి సాగు కోసం రైతులు ముందుగా తూకాలు సిద్ధం చేసుకోవాలి. ఇందుకు మరో రెండు వారాల సమయం మాత్రమే మిగిలింది. మండలంలో గత సంవత్సరం ఖరీఫ్‌లో 5290 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ సారి వర్షాలు ఆశాజనకంగా ఉంటే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలున్నాయి. ఇదిలా ఉండగా..



మల్కారంలోని ఓ పొలంలో ఉన్న నారు

స్థానిక రైతులు ఎక్కువగా ఆర్‌ఎన్‌ఆర్(తెలంగాణ సోనా) రకం వరి సాగు చేస్తుంటారు. జులై 15 వరకు తూకాలు పోసుకుంటే.. ఆగస్టు 15 లోగా వరినాట్లు పూర్తి చేస్తేనే దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది. లేదంటే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుంది.

వర్షాధార పంటలపై ప్రభావం

సకాలంలో వర్షాలు కురవకపోతే వర్షాధార పంటల సాగుపై తీవ్ర ప్రభావం ఉంటుంది. మండలంలోని వర్షాధారంగా రైతులు మొక్కజొన్న, కందులు, పత్తి, జొన్న పంటలు సాగు చేస్తారు. గత ఏడాదిలో ఈ పంటల సాగు విస్తీర్ణం సుమారు 450 ఎకరాలు నమోదైంది.

లోటు వర్షపాతం

మండలంలో జూన్ నెలలో లోటు వర్షపాతం నమోదైంది. ఈ నెలలో సాధారణ వర్షపాతం 94.6 మి.మీటర్లు కాగా.. ఇప్పటి వరకు కేవలం 17.9 మి.మీటర్ల వర్షం కురిసింది. ఈ వానలు కూడా మండలంలో అన్నిచోట్ల కురవలేదు. దీంతో ఇప్పటి వరకు 81 శాతం లోటు వర్షపాతం నమోదైంది. మరో 15 రోజులు ఖరీఫ్ సీజన్‌కు వర్షాలు కీలకంగా మారనున్నాయి. ఈలోగా ఆశించిన వానలు లేకపోవతే పంటల సాగుపై ప్రభావం పడనుంది.

బోర్లలో నీళ్లు తగ్గుతున్నాయి



వర్షాలు లేక బోర్లలో నీళ్ల రోజు రోజుకు తగ్గుతున్నాయి. తూకాలు పోసుకుని వరి సాగుకు సిద్ధం చేసుకుంటున్నాం. ఈ సమయంలో వర్షాలు లేకపోతే.. ఏమి చేయాలో అర్థం కావడం లేదు. వరి నారు వేసే సమయానికి కరిగెట్లు పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. మరో పది రోజుల్లో నారు సిద్ధమవుతుంది.

– సురేందర్‌రెడ్డి, రైతు, మల్కారం

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీసీపీ శ్రీనివాస్

ఏజీవర్సిటీ: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని, వాటికి దూరంగా ఉండాలని రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పీవీ నర్సింహారావు వెటర్నరీ కాలేజీలో బుధవారం ప్రపంచ డ్రగ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. జీవితంలో మత్తు పదార్థాల జోలికి వెళ్లబోమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వెటర్నరీ కాలేజీ నుంచి డెయిరీ ఫార్మ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగస్వాములవ్వాలి

శంషాబాద్: మాదక ద్రవ్యాల నిర్మూలనలో పౌరులు భాగస్వాములవ్వాలని శంషాబాద్ డీసీపీ రాజేష్ అన్నారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగ దినం సదర్భంగా పట్టణంలో వివిధ పాఠశాలల విద్యార్థులు, యువతతో కలిసి బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం పోలీసు యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందన్నారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా కాపాడాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో ఏసీపీ కె.ఎస్.రావు, ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంషాబాద్ డీసీపీ రాజేష్

అవగాహన ర్యాలీ

శంషాబాద్ రూరల్: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా మండలంలోని పెద్దతూప్రతండాలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సంకల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. మత్తు పదార్థాలు, మద్యానికి దూరంగా ఉంటేనే సమాజం బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఐఆర్‌సీపీ ప్రాజెక్టు ఇన్‌చార్జి గంట తిరుపతిరావు, సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పెద్దతూప్రతండా ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, స్థానికులు

బోనాల నిర్వహణకు సహకరించాలి

గోల్కొండ: ఆషాఢమాసం బోనాలు విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు సాయిబాబాచారి అన్నారు. గోల్కొండ కోట నగీనాబాగ్‌లో సంఘం ఆధ్వర్యంలో బుధవారం అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు యువతుల అదృశ్యం



జ్యోతి



మోహి ఉన్నిసా రఫత్

అత్తాపూర్: వేర్వేరు చోట్ల ఇద్దరులు యువతులు బుధవారం అదృశ్యమయ్యారు. ఓ యువతి కళాశాలకు అని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. మరో ఘటనలో ఇంట్లో అందరూ నిద్ర పోయిన తర్వాత అదృశ్యమైంది. ఈ ఘటనలు అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగాయి. పోలీసుల వివరాల ప్రకారం.. అత్తాపూర్‌లోని పాండురంగానగర్‌కు చెందిన బి.జ్యోతి(20) డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతుంది. మేనమామ సంగమేశ్వర్ ఇంట్లో ఉంటూ చదువుకుంటుంది. ఈ నెల 22వ తేదీన ఉదయం 9 గంటల సమయంలో కళాశాలకు అని ఇంట్లో నుంచి వెళ్లి రాత్రి అయినా తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. మామ సంగమేశ్వర్ అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మరో ఘటనలో..

రాజేంద్రనగర్ అత్తాపూర్‌లోని హుడా కాలనీకి చెందిన మోహి ఉన్నిసా రఫత్(18) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఈ నెల 17న రాత్రి 9 గంటలకు భోజనం చేసి ఇంట్లో అందరు పడుకున్నారు. మరుసటి రోజు ఉదయం 4 గంటలకు కుటుంబ సభ్యులు ఇంట్లో చూడగా.. మోహి ఉన్నిసా రఫత్ కనిపించలేదు. బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో కార్మికులు సీఐటీయూలో చేరిక

మణికొండ : నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట చంద్రారెడ్డి చౌరస్తా ఆటో కార్మికులు బుధవారం రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి రుద్రకుమార్ సమక్షంలో సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్మికులకు లేబర్ అధికారుల నుంచి ఎలాంటి సహకారం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీమా సౌకర్యంతో పాటు పర్మినెంట్ అడ్డాలను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, ఆటో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎం. కుమార్, అధ్యక్షుడు యాదగిరి, ఉపాధ్యక్షుడు రాఖేష్, నాయకులు నారాయణ, పి.సుధాకర్, సంయుక్త కార్యదర్శి జగన్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.



సీఐటీయూలో చేరుతున్న ఆటో కార్మికులు

హెల్ప్ డెస్క్‌లను సద్వినియోగం చేసుకోండి

- సర్కిల్ ఉప కమిషనర్ రవి కుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లలో ప్రజా పాలన హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశామని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్కిల్ ఉప కమిషనర్ రవి కుమార్ అన్నారు. బుధవారం అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్లలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కౌంటర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు అర్హులైన వారు ఈ హెల్ప్‌డెస్క్‌లో దరఖాస్తులను ఇవ్వాలన్నారు. ప్రతిరోజు హెల్ప్‌డెస్క్ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందన్నారు. దళారులను నమ్మవద్దన్నారు. నమోదు కోసం డబ్బులు అడిగితే కౌంటర్‌లోని అధికారికి లేదా సర్కిల్ కార్యాలయంలో నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఓ రాధారాణి తదితరులు పాల్గొన్నారు.



హెల్ప్‌డెస్క్‌లను పరిశీలిస్తున్న సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మణికొండ: గండిపేట చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బయటపడింది. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరి కృష్ణారెడ్డి వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం గండిపేట చెరువులో ఓ శవం ఉందని స్థానికులు సమాచారమిచ్చారు. పోలీసులు వెళ్లి చూడగా.. అతని శరీరం ఉబ్బిపోయి, గుర్తుపట్టరాకుండా మారింది. నాలుగు నుంచి ఐదు రోజుల క్రితం అతను చెరువులో పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అతని శరీరంపై ఎలాంటి దుస్తులు లేవని, వయసు 40 నుంచి 45 సంవత్సరాలు ఉంటాయన్నారు. జలమండలి అధికారుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్టు ఇన్‌స్పెక్టర్ హరి కృష్ణారెడ్డి తెలిపారు.

పనుల్లో నిర్లక్ష్యం తగదు

గోల్కొండ: వర్షాకాలం ప్రారంభమైనా అధికారులు నాలా పూడికతీత, పైపులైన్ పనులు పూర్తి చేయకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. ఎస్ఎన్‌డీపీ, బల్దియా అధికారులతో కలిసి టోలిచౌకీ, నానల్ నగర్ డివిజన్‌లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా నాలా, పైపులైన్ పనులను పరిశీలించి నత్తనడకన సాగుతుండడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుల్కాపూర్ నాలా పూడికతీత పనులు వేగవంతం చేయాలని టోలిచౌకీ, బాల్‌రెడ్డినగర్, రియాసత్‌నగర్, ఎండీ లైన్స్ తదితరు ప్రాంతాల్లో వరద నీటి పైపలైన్ పనులు సైతం యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.




నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

నిరసన కొనసాగిస్తాం..

హెచ్‌సీయూ విద్యార్థులు

గచ్చిబౌలి: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులపై సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని హెచ్‌సీయూ స్టూడెంట్స్ యూనియన్ 2023–24 అధ్యక్షుడు ఎండీ అతీక్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి దీపక్‌ఆర్య డిమాండ్ చేశారు. బుధవారం హెచ్‌సీయూ ప్రధాన గేటు వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల సస్పెన్షన్, కేసులను ఎత్తివేయకుంటే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని అన్నారు. అలాగే సుకూన్ నిర్వహణకు నిధులు విడుదల చేయాలని కోరారు .అధికారులు నియంతృత్వ వైఖరిని విడనాడాలని సూచించారు .డిమాండ్లు నెరవేరే వరకు నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కల బారినుంచి కాపాడండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఫెడరేషన్ నాయకులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో ప్రతి రోజు ఓ చోట కుక్కలు కరవడం, వెంటపడడం జరుగుతుందని, వాటిని నివారించాలని మణికొండ మున్సిపాలిటీ ఆల్ కాలనీస్ ఫెడరేషన్ నాయకులు మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వి.ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శి బాబు రావు తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ బంద్ విజయవంతం



శంషాబాద్ : ప్రభుత్వ పాఠశాలను బంద్ చేయిస్తున్న ఏబీవీపీ నేతలు

రాజేంద్రనగర్: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బుధవారం ఏబీవీపీ చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పాఠశాలలను యజమానులు స్వచ్ఛందంగా మూసివేశారు. తెరిచి ఉన్న పాఠశాలలను నాయకులు, కార్యకర్తలు మూసివేయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

శంషాబాద్‌లో...

శంషాబాద్ : ప్రయివేటు పాఠశాలల్లో అధిక ఫీజులను అరికట్టాలని, ప్రభుత్వ బడుల్లో వసతులను కల్పించాలని చేపట్టిన పాఠశాలల బంద్ విజయవంతమైందని ఏబీవీపీ జిల్లా అధ్యక్షుడు మహేష్, నాయకుడు కోటి ప్రదీప్ అన్నారు. బుధవారం పట్టణంలో ప్రయివేటు పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్ చేయగా.. ప్రభుత్వ పాఠశాలలను నాయకులు బంద్ చేయించారు.